ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

Bullet Edition

ఆదివారం 10 నవంబరు 2024 www.prajaaswaramdaily.com 2 pm

## ప్రముఖ తమిళ నటుడు

# ఢిల్లీ గణేశ్ కన్నుమూత



సినిమా : ప్రముఖ తమిళ నటుడు ఢిల్లీ గణేష్ కన్నుమూశారు. వృద్ధాప్యం కారణంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. వయసు 80. నిన్న రాత్రి 11 గంటలకు ఆయన తుదిశ్వాస విడిచారు. ఈరోజు అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. నాలుగు దశాబ్దాల పాటు సాగిన కెరీర్‌తో, గణేష్ 1977లో అరంగేట్రం చేసి తమిళం, తెలుగు మలయాళంలో 400 చిత్రాలకు పైగా నటించారు. అతను విలన్‌ల నుంచి తండ్రి పాత్రల వరకు బహుముఖ పాత్రలకు ప్రసిద్ధి చెందాడు. రజనీకాంత్, కమల్ హాసన్, విజయకాంత్ వంటి కొన్ని పెద్ద స్టార్‌లతో స్క్రీన్‌ను పంచుకున్నాడు. నటనకు ముందు, అతను భారతీయ వైమానిక దళంలో ఒక దశాబ్దం పాటు అంటే 1964-1974 వరకు కూడా పనిచేశాడు. ఢిల్లీ గణేష్ నాయకన్ (1987), మైఖేల్ మధన కామ రాజన్ (1990) వంటి చిత్రాలలో తన పాత్రలకు ప్రసిద్ధి చెందాడు. " మిస్టర్ ఢిల్లీ గణేష్ నవంబర్ 9వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో మరణించారని తెలియజేయడానికి మేము చాలా చింతిస్తున్నాము." అంటూ సోషల్ మీడియా వేదికగా కుటుంబీకులు ప్రకటించారు. ప్రజల సందర్శనార్థం ఆయన భౌతికకాయాన్ని రామాపురంలో ఉంచారు.

# ఎలివేటెడ్ కారిడార్





### రూ. 110 కోట్లతో ఘాట్ రోడ్ నిర్మాణానికి సీఎం శంకుస్థాపన

### కురుమూర్తి సన్నిధిలో రేవంత్ రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి, రాజనర్సింహ

మహబూబ్ నగర్, ప్రజాస్వరం : మహబూబ్ నగర్ జిల్లా అమ్మాపురంలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటిస్తున్నారు. అమ్మాపురం ఘాట్ లో ఎలివేటడ్ కారిడార్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ. 110 కోట్లతో ఘాట్ రోడ్ నిర్మాణం చేపట్టనున్నారు. తొలుత ఆలయ నిర్వాహకులు ఘనస్వాగతం పలికారు. కురుమూర్తి ఆలయంలో సీఎం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలను అందజేశారు. ఆయన వెంట మంత్రులు కోమటిరెడ్డి, దామోదర రాజనర్సింహ, నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# ఎలాంటి అనుమానాలు వద్దు

### కులగణన సర్వేపై మంత్రి ప్రభాకర్

### అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



హుస్నాబాద్, ప్రజాస్వరం : ఎవరెంతో వారికంత వాటా దక్కాలనే విధానంతోనే తమ ప్రభుత్వం కులగణన చేపడుతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ లో ఎన్యూమరేటర్లతో కలిసి ప్రజల వివరాలు సేకరించారు. ఎవరెంతో వారికంత వాటా దక్కాలని, సమాజంలో ఉన్న అసమానతలు పోగొట్టేందుకే కులగణన చేస్తున్నామన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు పోతోందని చెప్పారు. కులాల బలం తెలిస్తే ఆయా కులాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుందన్నారు. ప్రజలు కులగణన సర్వేకు సహకరించేందుకు కులసంఘాల నాయకులు మోటివేషన్ చేయాలన్నారు. అనారోగ్యం కలిగితే డాక్టర్ వద్ద ఒంట్లోని సమస్యలు ఎట్లా చెప్తారో, ఇంటికి వచ్చిన ఎన్యూమరేటర్లకు ఆస్తుల వివరాలు అట్లా చెప్పాలన్నారు. ఎక్స్ రే చూసి డాక్టర్ రోగాలను నయంచేసే మందులు ఎలా ఇస్తాడో, ఆ సర్వే సమాచారంతో ప్రభుత్వం ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రణాళికలు రూపొందిస్తుందన్నారు. ఈ సర్వేపై ప్రజలు ఎలాంటి అనుమానాలు పెట్టుకోవద్దని, ఆ సమాచారాన్ని ప్రభుత్వం గోప్యంగా ఉంచుతుందన్నారు.

### మూసీ ప్రక్షాళనకు

# మేం వ్యతిరేకం కాదు

### రైతుల పరిస్థితి దయనీయం -కేంద్రమంత్రి బండిసంజయ్



హైదరాబాద్, ప్రజాస్వరం : తెలంగాణలో రైతుల పరిస్థితి దయనీయంగా ఉందని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అర్హులకు కూడా రుణమాఫీ కాలేదని విమర్శించారు. బోనస్ డబ్బులు తప్పించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. మూసీ ప్రక్షాళనకు మేం వ్యతిరేకం కాదని వెల్లడించారు. కమీషన్ల కోసం పేదల ఇళ్లు కూలిస్తే ఊరుకోం అని బండి హెచ్చరించారు.

# గ్రూప్ 3 హాల్ టికెట్ల విడుదల

### 17, 18న పరీక్ష




హైదరాబాద్: తెలంగాణలో గ్రూప్-3 పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లను టీజీపీఎస్సీ విడుదల చేసింది. ఈ నెల 17, 18 తేదీల్లో పరీక్ష నిర్వహించనున్నారు. ఈ నెల 17న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్-1 పరీక్ష జరగనుంది. అదే రోజు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్-2 పరీక్ష నిర్వహిస్తారు. 18న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్-3 పరీక్ష ఉండనుంది. ఈ పోస్టులకు 5.36 లక్షల మందికిపైగా దరఖాస్తు చేసుకున్నారు. ఉదయం జరిగే పరీక్షలకు 9.30 తర్వాత, మధ్యాహ్నం జరిగే పరీక్షకు 2.30 అనంతరం పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించబోమని ఇటీవల టీజీపీఎస్సీ స్పష్టం చేసింది. అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్ కాపీని భద్రంగా పెట్టుకోవాలని, తొలిరోజు పేపర్-1 పరీక్షకు హాజరైన హాల్‌టికెట్‌ను మిగతా పరీక్షలకు ఉపయోగించాలని పేర్కొంది. ప్రశ్నపత్రాలు, హాల్‌టికెట్లను నియామక ప్రక్రియ ముగిసేవరకు భద్రంగా పెట్టుకోవాలని సూచించింది.

# అజ్ఞాతంలో నటి కస్తూరి



చెన్నై: తెలుగు ప్రజలకు సుపరిచితురాలైన నటి కస్తూరి అజ్ఞాతంలోకి వెళ్లారు. తెలుగు ప్రజలపై ఇటీవలే అనుచిత వ్యాఖ్యలు చేయడం తెలిసిందే. అంతఃపుర మహిళలకు సేవ చేసేందుకే.. తెలుగువారు వచ్చారంటూ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. దీనికి ఆమె స్పందిస్తూ క్షమాపణ కూడా చెప్పారు. ఈ వ్యాఖ్యలపై తెలుగు సంఘాలు వారు మండిపడ్డారు కూడా. మూడు రోజుల క్రితం కస్తూరిపై చెన్నైలో కేసులు నమోదు సమన్లు ఇచ్చేందుకు పోలీసులు ఇంటికి వెళ్లారు. ఇంటిలో లేదని సమాచారం. ఆమె ఫోన్ స్విచాఫ్, ఇంటికి తాళం ఉంది.

### 'తెలంగాణ స్పైస్ కిచెన్'లో

# భారీ పేలుడు

### పెద్ద శబ్దంతో పేలిన ఫ్రిజ్ కంప్రెషర్

### రాళ్లు ఎగిరిపడి దుర్గాభవానీ నగర్ బస్తీలోని 4 గుడిసెలు ధ్వంసం

### రాళ్లు తగిలి ఓ మహిళకు గాయాలు

### జూబ్లీహిల్స్‌లో ఘటన



హైదరాబాద్ జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 1లోని తెలంగాణ స్పైస్ కిచెన్ హోటల్‌లో ఈ తెల్లవారుజామున భారీ పేలుడు సంభవించింది. హోటల్‌లోని రిఫ్రిజిరేటర్ కంప్రెషర్ పెద్ద శబ్దంతో పేలింది. దీంతో హోటల్ ప్రహరీ ధ్వంసమైంది. రాళ్లు ఎగిరి వంద మీటర్ల దూరంలోని దుర్గాభవానీ నగర్ బస్తీలో పడడంతో నాలుగు గుడిసెలు ధ్వంసమయ్యాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. రాళ్లు తగిలి ఓ మహిళ గాయపడింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. హోటల్ నిర్వాహకులతో మాట్లాడారు. హోటల్ నిర్వాహకులు మీడియాను లోపలికి అనుమతించకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రజావంచన వారోత్సవాలు

### కోలుకోలేని విధ్వంసం సృష్టించి విజయోత్సవాలా ?

### ఎనుముల ఏలికలో.. తెలంగాణ బతుకు చీలికలు, పీలికలే

### ఎక్స్ వేదికగా కేటీఆర్ విమర్శలు



**హైదరాబాద్, ప్రజాస్వరం** : కాంగ్రెస్ సర్కారు కొలువుదీరి సంవత్సరం పూర్తవుతున్న సందర్భంగా నిర్వహించాల్సింది విజయోత్సవాలు కాదు.. "కుంభకోణాల కుంభమేళా". ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీకి పాతరేసిన నేపథ్యంలో జరపాల్సింది విజయోత్సవాలు కాదు.. ప్రజావంచన వారోత్సవాలు అని మాజీ మంత్రి కేటీఆర్ ఎక్స్ వేదికగా విమర్శలు చేశారు. ఎనుముల వారి ఏడాది పాలనలో చెప్పుకోవడానికి ఏమున్నది గర్వకారణం అంటే.. మూసీలో లక్షన్నర కోట్ల మూటల వేట..! కొడంగల్ లిఫ్టులో వేల కోట్ల కాసుల వేట..!! బావమరిదికి అమృత్ టెండర్లను, కొడుకులకు వేలకోట్ల కాంట్రాక్టులను కట్టబెట్టే ముఖ్యమంత్రి, మంత్రులు జరుపుకోవాల్సింది విజయోత్సవాలు కాదు.. "కరప్షన్ కార్నివాల్" అని అన్నారు. ఏడాది కాలంగా ప్రతిరోజూ పరిపాలనా వైఫల్యాలకు కేరాఫ్ కాంగ్రెస్ సర్కారు. సకల రంగాల్లో సంక్షోభం తప్ప సంతోషం లేని సందర్భాలకు చిరునామా రేవంత్ పాలన. మరి, ఏ ముఖం పెట్టుకుని విజయోత్సవాలు నిర్వహిస్తారన్నారు.

### ఆ పదం వాడే హక్కు మీకు లేదు

ప్రజలకిచ్చిన 6 గ్యారెంటీలు, 420 హామీల్లో ఒక్కటంటే ఒక్క వాగ్దానం కూడా సరిగ్గా అమలుచేయకుండా జనం పైసలతో 25 రోజులపాటు జల్సాలు చేసుకుంటారా ? అని అడిగారు. రుణమాఫీ కాక, పెట్టుబడి సాయం అందక పేద రైతులు దుఖంలో ఉంటే మీరు వందల కోట్లతో విజయోత్సవాలు చేసుకుంటారా? హైడ్రా, మూసీ బాధితులు బాధలో ఉంటే మీరు బాజాభజంత్రీలతో పండుగ చేసుకుంటారా? ఆడబిడ్డలు రక్షణ లేక అల్లాడుతుంటే మీరు విజయోత్సవాల పేరిట విర్రవీగుతారా? వృద్ధులు పింఛన్ల పెంపు కోసం వెయ్యి కళ్లతో ఎదురుచూస్తుంటే మీరు దయలేకుండా దావత్ లు చేసుకుంటారా ? అని నిలదీశారు. బీఆర్ఎస్ భర్తీచేసిన ఉద్యోగాల ప్రక్రియను మీ ఖాతాలో వేసుకోవడం నయవంచన కాదా ? పావుశాతం కూడా రుణమాఫీ పూర్తిచేయకుండా వందశాతం చేశామని చెప్పుకోవడం దగా కాదా ? 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 కే సిలిండర్ పథకాలకు సవాలక్ష ఆంక్షలు పెట్టి మెజారిటీ అర్హులను దూరం చేయడం మోసం కాదా ?. 75 ఏళ్ల స్వతంత్ర భారత చరిత్రలో అతితక్కువ సమయంలో అత్యధిక ప్రజావ్యతిరేకత మూటగట్టుకున్న తొలి ప్రభుత్వం, ఏకైక రాష్ట్ర ప్రభుత్వం ఇదే అని ప్రశ్నించారు. ఈ ముఖ్యమంత్రికి పాలనపై పట్టు కాదు.. ఈ ప్రభుత్వానికి తెలంగాణపై ప్రేమలేదు. పేదల ఇళ్లు కూల్చి రోడ్డున పడేసిన కాంగ్రెస్ సర్కారుకు అసలు మనసే లేదు. విజయోత్సవాలు అంటే ఏంటో కూడా తెలియని ఈ అసమర్థ పాలకులకు ఆ పదాన్ని వాడే హక్కే లేదన్నారు.